సాక్షి నిజామాబాద్

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



ప్రపంచ దేశాలకు..

ప్రపంచ దేశాలకు భారత ఆర్థిక వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు.

- 8లో ▸



ఫోన్ హ్యాక్.. ఖాతా షేక్...

సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏపీకే ఫైల్స్ పంపి ఫోన్‌లను హ్యాక్ చేస్తున్నారు. ఖాతాల్లోని డబ్బులను దోచుకుంటున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /21.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం, సాయంత్రం వేళ ఉరుములతో కూడిన వర్షంకురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజావాణికి 114 ఫిర్యాదులు



నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 114 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి అర్జీలు అందజేశారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 11..



ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 11 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల సమస్యలను విన్న సీపీ సాయిచైతన్య వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు పోలీసుల సేవలను స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తోందని సీపీ పేర్కొన్నారు.

13న జిల్లా కబడ్డీ బాలుర జట్ల ఎంపికలు

నిజామాబాద్ నాగారం: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని క్రీడా మైదానంలో అండర్–16 బాలుర జట్ల ఎంపికలు జరుగుతాయని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగయ్య, గంగాధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనేవారు 16 సంవత్సరాల్లోపు వయస్సు, 55 కేజీల బరువు ఉండాలన్నారు. ఆధార్ కార్డుతోపాటు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

12 వరకు అంబేడ్కర్ వర్సిటీలో ప్రవేశాలు

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 12వ తేదీ వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులకు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కో ఆర్డినేటర్ రంజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఎస్సీ, ఎంపీసీ, బీజెడ్‌సీ, పీజీలో ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిండుకుండలా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు



వరదలే వరదలు

- దశాబ్దాలుగా కళకళలాడుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు
- 47 ఏళ్లుగా ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో
- చరిత్రలో అత్యధికంగా 1983లో.. అతి తక్కువ 1987, 2015లో..
- రెండుసార్లు డెడ్ స్టోరేజీకన్నా తక్కువ నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దశాబ్దాలుగా నీటితో కళకళలాడుతోంది. 47 ఏళ్ల చరిత్రలో కేవలం రెండేళ్లు మాత్రమే స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టుకు 1983 నుంచి వరదలు ప్రారంభమయ్యాయి. 1978 నుంచి కాలువల ద్వారా నీటి విడుదల ప్రారంభించినప్పటికీ ఆ సమయంలో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కాలేదు. గడిచిన 47 ఏళ్లలో 10 సంవత్సరాలు మాత్రమే స్వల్పంగా వరద నీరు వచ్చి చేరింది. 1987, 2015లో మాత్రమే ప్రాజెక్ట్ నీటి మట్టం డెడ్ స్టోరేజీ (5 టీఎంసీలు) కన్నా తక్కువ నీటి మట్టానికి పడిపోయింది. దశాబ్ద కాలంగా ప్రతి ఏడాది ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతుండగా మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు.

10 ఏళ్లు స్వల్ప ఇన్‌ఫ్లో

ఎస్సారెస్పీకి 1983 నుంచి వరదలు ప్రారంభం కాగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 ఏళ్లు మాత్రమే ప్రాజెక్ట్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కన్నా తక్కువ ఇన్‌ఫ్లో వచ్చి చేరింది.

సంవత్సరం	ఇన్‌ఫ్లో (టీఎంసీల్లో..)
1985 - 86	85.64
1987 - 88	4.4
1992 - 93	58.74
2003 - 04	54.02
2004 - 05	19.07
2009 - 10	27.34
2010 - 11	27.52
2012 - 13	54.37
2014 - 15	14.77
2015 - 16	4.42

అధికంగా 1983లో..


స్థానిక ఎగువ ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర నుంచి ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో వస్తుండగా అత్యధికంగా 1983లో వరద వచ్చింది. దీంతో వరద గేట్ల ద్వారా ప్రాజెక్ట్ నుంచి భారీగా నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయి.

సంవత్సరం	ఇన్‌ఫ్లో (టీఎంసీల్లో..)
1983 - 84	1165
1988 - 89	912.95
1989 - 90	576.28
1990 - 91	687.69
1998 - 99	552.44
2005 - 06	374.42
2006 - 07	515.48

ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకు 370 టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని ప్రాజెక్ట్ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి.

మళ్లీ పోటెత్తిన వరద..

- 12 వరద గేట్ల ద్వారా 37,500 క్యూసెక్కుల నీటి విడుదల
- ఎగువ నుంచి 66,685 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



వరద గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద మళ్లీ పోటెత్తింది. ఆదివారం సాయంత్రం 28 వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో క్రమంగా 50 వేల క్యూసెక్కులకు పెరిగింది. ఆదివారం రాత్రి 7గంటలకు 8 గేట్లను ఎత్తి 12,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అర్ధరాత్రి తరువాత 54 వేల క్యూసెక్కుల కు పెరగడంతో అవుట్‌ఫ్లోను 25వేల క్యూసెక్కు లకు పెంచారు. సోమవారం రోజంతా నిలకడగా కొనసాగిన ఇన్‌ఫ్లో సాయంత్రానికి 66,685 క్యూ సెక్కులకు పెరిగింది. దీంతో 12 వరద గేట్ల ద్వా రా 37,500 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ నుంచి వరద మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

కాలువల ద్వారా..

వరద కాలువ ద్వారా 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2500, సరస్వతి కాలువ ద్వారా 800, లక్ష్మికాలువ ద్వారా 200, గుత్ప లిఫ్ట్‌కు 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తుండగా, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

యూరియా.. లేదయ!

- వేధిస్తున్న కొరత
- ఇబ్బందిపడుతున్న రైతులు
- బస్తా కోసం గంటల తరబడి బారులు
- అయినా దక్కక నిరాశ



మాచారెడ్డిలో వరుసలో ఉన్న రైతులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వానాకాలంలో సాగు చేసిన పంటలకు అవసరమైన మేర యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలి కాలంలో ఎక్కడ చూసినా రైతులు ఎరువుల కోసం సహకార సంఘాల వద్ద బారులు తీరి కనిపిస్తున్నారు. కొన్ని చోట్ల రాత్రి వేళలోనే సొసైటీకి చేరుకుని అక్కడే ఉండి పొద్దున్నే వరుసలో నిల్చుంటున్నారు. మరికొన్ని చోట్ల చెప్పులు, రాళ్లు, చెట్లకొమ్మలు, పాసుపుస్తకాల జిరాక్సులను వరుస లో పెడుతున్నారు. జిల్లాలోని మాచారెడ్డి, రామారె డ్డి, బీబీపేట, భిక్కనూరు, దోమకొండ, కామారెడ్డి తదితర మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఆయా మండలాల్లో యూరియా కోసం రైతులు పది రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో చెరువులు, ప్రాజెక్టు లు నిండాయి. వర్షాలతో కొంత నష్టం జరిగినా, ఉన్న పంటలకు ఎరువులు వేయాలని రైతులు సహ కార సంఘాల చుట్టూ తిరుగుతున్నారు. స్టాక్‌కు మించి రైతులు వస్తుండడంతో ఒక్కో బస్తా చొప్పు నే పంపిణీ చేస్తున్నారు. ఆ ఒక్క బస్తా కూడా చాలామందికి దక్కడం లేదు.

ఆందోళనకు దిగుతున్న రైతులు..

ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతున్న రైతులు ఆందోళనకు దిగుతున్నారు. రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలో రైతులు సోమవారం యూరియా కోసం ధర్నా చేశారు. అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాచారెడ్డి మండల కేంద్రంలోనూ రైతులు రోడ్డెక్కారు.

పోలీసు పహారాలో పంపిణీ...

మాచారెడ్డి మండల కేంద్రంలోని సహకార సంఘానికి సోమవారం భారీ సంఖ్యలో రైతులు తరలిరావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కూపన్లు ఇవ్వడానికి అధికారులు పోలీసుల సాయం తీసుకున్నారు. అక్కడ రైతులు, పోలీసులకు మధ్య పలుమార్లు వాగ్వాదం జరిగింది. అలాగే వ్యవసాయశాఖ, సహకార శాఖ అధికారులతోనూ రైతులు గొడవకు దిగారు.

ప్రైవేటు వ్యాపారుల బ్లాక్ దందా....

కొందరు వ్యాపారులు ముందుగానే యూరియాను బ్లాక్ చేసి ఉంచారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎ క్కువ డబ్బులు తీసుకుని విక్రయిస్తున్నట్లు తెలు స్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు దళారులు పెద్ద మొత్తంలో ఎరువులు స్టాక్ చేసి ఉంచారన్న ప్రచారం జరుగుతోంది.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : మండలకేంద్రానికి సోమవారం యూరియా వస్తుందని అధికారులు చెప్పడంతో వేకువజామునే అన్ని గ్రామాల నుంచి సింగిల్ విండోకు వచ్చి బారులు తీరారు. యూరియా రాకపోవడంతో విసిగి వేసారిన రైతులు ఇటుకలను క్యూలో ఉంచి ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని రోడ్డుపై రాస్తారోకో చేశారు.

సమస్య పరిష్కారమవుతుంది

జిల్లాలో 48 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవ సరం ఉండగా.. ఇప్పటికే 46 వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. దానిని రైతులకు అందించాం. మంగళవా రం మరో 800 మెట్రిక్ టన్నుల యూరియా రానుంది. ఆయా సొసైటీలకు సరఫరా చేసి రైతులకు పంపిణీ చేస్తాం. బ్లాక్ మార్కెట్ విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా బ్లాక్‌మార్కెట్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

గ్రామ పాలనాధికారులకు పోస్టింగ్‌లు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: గ్రామ పాలనాధికారులు(జీపీవో)గా నియమితులైన వారికి సోమ వారం పోస్టింగ్‌లు ఇచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వా రా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ జీపీవోలకు పోస్టింగ్‌లను ఖరారు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. అదనపు కలెక్టర్లు అంకిత్, కిర ణ్ కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఇతర అధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు.

రేపు 'స్థానిక' తుది ఓటరు జాబితా

- కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10వ తేదీన వెలువరించనున్నట్లు కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసిన తరువాత 10వ తేదీన తుది జాబితా వెలువరిస్తామని అన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో సైతం అభ్యంతరాలు ఉంటే తెలుపాలన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

- జిల్లా స్థాయిలో 40 మంది టీచర్ల ఎంపిక



నిజామాబాద్‌అర్బన్: జిల్లా స్థాయిలో 40 మంది ఉత్తమ టీచర్లుగా ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ సోమవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కలెక్టరేట్‌లో మంగళవారం ఉత్తమ టీచర్లను ఉన్నతాధికారులు సన్మానించనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

హెచ్‌ఎం కేటగిరి : టి హరిచరణ్ (కుకునూర్, వేల్పూర్), టి సురేశ్‌కుమార్ (డొంకేశ్వర్), డి రవీందర్ (మామిడిపల్లి, ఆర్మూర్), సీహెచ్ రాంప్రసాద్ (కోనాపూర్, కమ్మర్‌పల్లి).

స్కూల్ అసిస్టెంట్: జి.రాజశేఖర్ (జెడ్పీహెచ్ఎస్, ఏర్గట్ల), ఎస్ మల్లేశ్ (రెంజర్ల), శ్రీనివాస్, ఎం.ప్రశాంత్‌కుమార్ (బాల్కొండ), ఏ శ్రీనివాస్ (మెండోరా), పి గణేశ్ (ఆలూర్), సయ్యద్ అబ్దుల్ నహీం (నీలా), పి గంగాధర్ (కుకునూర్), ఎం సుజాత (ముచ్కూర్), ఏ లక్ష్మీనారాయణ(ఎడపల్లి), టి సాయిలు (డొంకేశ్వర్), స్వప్న (డిచ్‌పల్లి), శ్రీనివాసరాజు (టీజీఎంఎస్, బాల్కొండ), ఎస్.స్రవంతి (కేజీబీవీ, ఆర్మూర్).

ఎస్జీటీ: బి.శివకుమార్ (శివతండా, నవీపేట్), పెద్ది రమణ (కుర్నాపల్లి), ఎస్‌కే అబ్దుల్ (వెల్మల్), ప్రవీణ్ కుమార్‌రెడ్డి (గుంజిలి), శ్రీనివాస్ (మోతె), ఎన్ విజయలక్ష్మి (నాగేపూర్), రాజు (ఇస్సాపల్లి), వి.సునీత (ఆర్మూర్), టి.వెంకటేశ్వర్లు (బర్దిపూర్, బోధన్), శృతిమ (శ్రీరాంపూర్), బాల్కొండ, అల్తా పుద్దీష్(ఫతేపూర్), డి.నరేంద్ర శేఖర్ (బాగేపల్లి).

ప్రత్యేక అవార్డులు

సీహెచ్ శంకర్ (బోర్గాం, మోపాల్), టి.సాయన్న (ఖిల్లా జీహెచ్ఎస్), హఫీజుద్దీన్(బెజ్జోరా), ఆదిల్ అహ్మద్ (నిజాంకాలనీ, నిజామాబాద్), శ్రీనివాస్ (చౌట్‌పల్లి), జి.కిషన్ (నారాయణపేట్, జక్రాన్‌పల్లి), శ్రీనివాస్ (వేంపల్లి, ముప్కాల్), డి.సునీత (నాళేశ్వర్), కే సుజాత (పులాంగ్, నిజామాబాద్), రమేశ్ (మానవతా సదన్, కేర్‌టేకర్, డిచ్‌పల్లి).

అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ

- రూ. రెండు కోట్లతో పనులు
- పాత భవనాల్లో మరుగుదొడ్ల నిర్మాణం.. తాగునీటి సదుపాయం
- 10 నూతన భవనాల నిర్మాణం





నిజామాబాద్ నగరంలోని ఒడ్డెరకాలనీలో ఆధునికీకరించిన భవనం



భవనం లోపలి గోడపై చిత్రాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటి వరకు మరుగుదొడ్ల సదుపాయం లేకపోగా, తాగునీటి సరఫరా అంతంతే. అరకొర సదుపాయాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండడంతో ప్రభుత్వం కేంద్రాల బలోపేతంపై దృష్టి సారించింది. రూ.2 కోట్ల నిధులతో జిల్లాలోని సెంటర్లను ఆధునికీకరించడంతోపాటు 10 నూతన భవనాలను నిర్మించాలని నిర్ణయించింది. జిల్లాలో నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మొత్తం ఐదు సీడీపీవో(చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) కార్యాలయాలు ఉండగా, వీటి పరిధిలో 1501 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 400 సెంటర్లకు సొంత భవనాలు ఉండగా, మిగతా చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే 400 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, 216 కేంద్రాల్లో తాగునీటి సదుపాయం కల్పించడంతోపాటు 10 నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పటికే 156 మరుగుదొడ్ల నిర్మాణ పూర్తయ్యాయని, 244 చోట్ల పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని పేర్కొంటున్నారు. సెంటర్ల ఆధునీకరణలో భాగంగా భవనాలకు రంగులు వేయించడంతోపాటు గోడలపై పిల్లలకు అర్థమయ్యేలా చిత్రాలు గీయించారు.

216 సెంటర్లలో తాగునీటి సదుపాయం కల్పించేందుకు పనులు చేపట్టగా 35 సెంటర్లలో పనులు పూర్తయ్యాయి. మొత్తం 10 చోట్ల నూతన భవనాల నిర్మాణ పనులు ప్రారంభించగా, ఇప్పటికే ఐదు చోట్ల పనులు పూర్తయ్యాయి.

రూపురేఖలు మారుతున్నాయి

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుతున్నాయి. మరమ్మతులతో పాటు ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సొంత భవనాలు ఉన్న చోట్ల మరుగుదొడ్ల నిర్మాణ పనులు, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నాం. అలాగే కొత్త భవనాలు సైతం నిర్మిస్తున్నాం.

– రసూల్‌బీ, జిల్లా సంక్షేమాధికారిణి

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బస్వా

- జిల్లా నేతలకు కీలక పదవులు
- బీజేపీ పూర్తిస్థాయి కార్యవర్గం ప్రకటన



సుభాష్‌నగర్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బస్వా లక్ష్మీనర్స య్య నియమితులయ్యారు. బీజేపీ పూర్తిస్థాయి కార్యవర్గంతోపాటు ఏడు మోర్చాల రాష్ట్ర అధ్యక్షుల ను పార్టీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు సోమవా రం ప్రకటించారు. బస్వా లక్ష్మీనర్సయ్య పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలోనే ఎంపీగా అర్వింద్ ధర్మపురి (2019లో) విజయం సాధించారు. మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జీగా 2024 ఎన్నికల్లో వ్యవహరించారు. ఆ ఎన్నికల్లో ఎంపీగా రఘునంద న్‌రావు గెలుపొందారు. ప్రస్తుతం వివిధ విభాగాలకు సంగారెడ్డి, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల ఇన్‌చార్జీగా కొనసాగుతున్న ఆయన.. స్టేట్ యాక్టివ్ మెంబర్స్ కో కన్వీనర్‌గా కూడా ఉన్నారు. తనను కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌కు బస్వాలక్ష్మీనర్సయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఉద్యమిస్తామని ఆయన పేర్కొన్నారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా గోపిడి స్రవంతిరెడ్డి



బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి నియమితులయ్యారు. స్రవంతిరెడ్డి 2020 సంవత్సరంలో పార్టీలో చేరి కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఆ తర్వాత మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరించారు. 2021లో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. తనను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, ఎంపీ అర్వింద్ ధర్మపురికి స్రవంతిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా

కామర్స్ విభాగం డీన్‌గా ప్రొఫెసర్ యాదగిరి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ ఎం యాదగిరి కామర్స్ విభాగం డీన్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. కామర్స్ విభాగంలో మూడు దశాబ్దాల బోధన, పరిశోధన అనుభవం కలిగిన ప్రొఫెసర్ యాదగిరి తెయూలో అనేక అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులు సమర్థంగా నిర్వహించారు. ప్రస్తుతం ప్రొఫెసర్ యాదగిరి తెయూ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు.

సోషల్ సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి



తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ కే.రవీందర్‌రెడ్డి సోషల్ సైన్స్ డీన్‌గా నియమితులయ్యారు. వీసీ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి సోమవారం రవీందర్‌రెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేశారు. రవీందర్‌రెడ్డి ప్రస్తుతం తెయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్నారు.

'గిరిరాజ్' వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నానికి డాక్టరేట్

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగరత్నానికి డాక్టరేట్ లభించింది. రసాయనశాస్త్రంలో 'పాలిమర్ మాట్రిక్స్‌తో ఔషధాలను జతచేసి, వాటి జీవప్రక్రియలపై అధ్యయనం' అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్‌బీ పట్వారీ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. నాందేడ్‌లోని ఎస్ఆర్‌టీఎం యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న రంగరత్నాన్ని అధ్యాపక బృందం సోమవారం సన్మానించింది. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి భరత్‌రాజ్, కార్యాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బాల్కొండ: జీవాలకు సోకే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో గొర్రెలకు, మేకలకు సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేశారు. జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలన్నారు. గ్రామంలో 850 గొర్రెలు, 140 మేకలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గౌతంరాజు, ఎల్ఎస్ఏ ప్రవీణ్, గోపాలమిత్రలు మల్లేశ్, షకీల్, ప్రణీత్, రైతులు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలం తడపాకల్‌కు చెందిన మారుతి ఫోన్‌ను ఇటీవల సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అతని ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లు, వాట్సాప్ గ్రూపులకు ఎస్‌బీఐ పేరిట ఏపీకే ఫైల్స్‌ను పంపించారు. తన ఫోన్ హ్యాక్ అయినట్లు గుర్తించిన మారుతి వెంటనే అప్రమత్తమై ఈ సమాచారం కాంటాక్ట్ లిస్టులో ఉన్న వారందరికీ చేరవేశాడు. బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము పోకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు.

మోర్తాడ్‌కు చెందిన ఒక వ్యాపారి ఫోన్‌ను ఏపీకే ఫైల్ ద్వారా హ్యాక్ చేసిన సైబర్ మోసగాళ్లు ఖాతాలో ఉన్న రూ.50వేలను కాజేశారు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి ఖాతా నుంచి ఏకంగా రూ.9లక్షలను దోచుకున్నారు.

ఫోన్ హ్యాక్.. ఖాతా షేక్..

- రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్లు
- ఏపీకే ఫైల్స్ పంపి ఫోన్లను హ్యాక్ చేస్తున్న కేటుగాళ్లు
- పాస్‌వర్డులు, ఓటీపీలతో ఖాతాల్లోని డబ్బులను దోచుకుంటున్న వైనం

మోర్తాడ్ (బాల్కొండ) : మనోడే కదా వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ పంపింది.. ఓపెన్ చేద్దామని క్లిక్ చేశారో ఇక అంతే సంగతులు. క్షణాల్లోనే సైబర్‌నేరగాళ్లు మీ ఫోన్‌ను హ్యాక్ చేసేస్తారు. ఎంచక్కా మొబైల్‌లోని పాస్‌వర్డులు, ఓటీటీలను తెలుసుకొని మీ ఖాతాల్లోని డబ్బులను దోచేస్తుంటారు. ఇలా ఒకరి తర్వాత మరొకరి మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లన్నింటికీ ఏపీకే ఫైల్ పంపుతూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు.

మోసం జరుగుతోంది ఇలాగే..

- సైబర్ మోసగాళ్లు వాట్సాప్‌కు 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి', ఎస్‌బీఐ, ఇతర బ్యాంకులు, ఆఫర్ల పేరిట ఓ ఏపీకే ఫైల్‌ను పంపిస్తారు.
- ఆ ఫైల్‌ను క్లిక్ చేయగానే మన మొబైల్ హ్యాక్ అవుతుంది. అనంతరం మన ప్రమేయం లేకుండానే సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను వాడేస్తుంటారు.



సైబర్ నేరగాళ్లు తడపాకల్ వాసి ఫోన్‌ను హ్యాక్‌చేసి పోస్టు చేసిన ఏపీకే ఫైల్

గుట్టుగా మన సమాచారాన్ని దొంగిలిస్తారు. ఆ తర్వాత బ్యాంకు పిన్, పాస్‌వర్డుల సహాయంతో మన ఖాతాను ఖాళీ చేస్తారు.

హ్యాకర్లకు చిక్కకుండా..

- భద్రమైన యాప్స్‌ను మాత్రమే ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- పాస్‌వర్డులు, పిన్ నంబర్లు, క్రెడిట్ కార్డులు ఇతరత్రా కీలక సమాచారాన్ని మొబైల్‌లో సేవ్ చేసుకోవద్దు.
- ఫోన్లకు ఇతరులు ఊహించలేని, కఠినతరమైన పాస్‌వర్డులు పెట్టుకోవాలి.
- ప్రధానంగా ఏపీకే ఫైల్స్, లింక్‌లను అసలే క్లిక్ చేయొద్దు.
- హ్యాక్ చేసిన మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లన్నింటికీ వాట్సాప్ ద్వారా ఏపీకే ఫైల్స్‌ను పంపిస్తూ ఇలాగే మోసం చేస్తుంటారు.

అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని, సైబర్ మోసగాళ్లకు చిక్కకుండా అప్రమత్తంగా ఉండాలి. ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దు. ఓటీపీ నంబర్లు ఎవరికీ చెప్పొద్దు.

– పొన్నం సత్యనారాయణ, సీఐ, భీమ్‌గల్

పంటలను గట్టెక్కించారు

- యూరియా కొరత తీర్చిన సొసైటీ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మాక్లూర్ సొసైటీ భవనం

మాక్లూర్: ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత రాకుండా తీసుకున్న జాగ్రత్తలు పంటలను గట్టెక్కించాయి. జిల్లాలో పలు మండలాల్లో యూరియా కొరత ఏర్పడినప్పటికీ మాక్లూర్‌లో మాత్రం రైతులు ఆ సమస్య ఎదుర్కోకుండా సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్ సఫలీకృతులయ్యారు. మాక్లూర్ మండలంలో మొత్తం 19,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తుండగా, సుమారు 2,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుంది. దీంతో నిత్యం ఉన్నతాధికారులతో మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతాంగానికి కావాల్సిన యూరియాను తెప్పించారు. గ్రామాలకు వెళ్లి యూరియా అవసరం ఉన్నంత వరకే కొనుగోలు చేసుకోవాలని ఆ తర్వాత మళ్లీ అవసరానికి యూరియా అందించే బాధ్యత తనదని రైతులకు హామీ ఇచ్చారు. ఆ దిశగా విడుతల వారీగా పంటకు కావాల్సిన యూరియాను అందించారు. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పొట్టదశలో ఉండగా, మరికొన్ని చోట్ల కంకి పూర్తిగా బయటికి వచ్చింది. కాగా, గతంలో సొసైటీకి వచ్చిన యూరియా పక్కదారి పట్టేదని, సమయానికి ఎరువులు వేయక దిగుబడి తగ్గి నష్టపోయామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం సరిపడా యూరియా అందించి పంటలను గట్టెక్కించడంపై రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కొరత రానివ్వలేదు



మాక్లూర్ సొసైటీకి చైర్మన్‌గా బూరోల్ల అశోక్ వచ్చినప్పటి నుంచి యూరియా కొరత లేకుండా చేశారు. ఆయన ఏం బాధపడ్డాడో కానీ మాకు యూరియా అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం మా పంటలన్నీ పొట్టదశలో ఉన్నాయి. యూరియా అవసరం ఈ పంటకు తీరినట్టే.

– నరేశ్ రావు, రైతు, వల్లభాపూర్, మాక్లూర్

జాగ్రత్త పడ్డాను..



సొసైటీకి చెడ్డ పేరు రావొద్దనే ఆలోచనతో ఖరీఫ్ సీజన్ కంటే నెల రోజుల ముందు నుండే జాగ్రత్త పడ్డాను. ఎంత యూరియా అవసరమవుతుందనే విషయాన్ని వ్యవసాయ అధికారుల ముందే తెలుసుకొని, ఉన్నతాధికారులతో మాట్లాడుతూ యూరియా తెప్పించాను. ఆలస్యంగా నాట్లు వేసిన వారి కోసం గోదాముల్లో యూరియా ఉంచాం.

– బూరోల్ల అశోక్, సొసైటీ చైర్మన్, మాక్లూర్

ప్రపంచ దేశాలకు మన ఆర్థిక వ్యవస్థ ఆదర్శం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ, నిర్మల సీతారామన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ధన్‌పాల్, దినేశ్

సుభాష్‌నగర్: ప్రపంచ దేశాలకు భారత ఆర్థిక వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. దేశ ప్రజలకు దీపావళి కానుకగా జీఎస్‌టీలో సంస్కరణలు తీసుకొచ్చినందుకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు నగరంలోని గాంధీచౌక్‌లో సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారితోకలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడారు. జీఎస్‌టీపై గగ్గోలు పెట్టిన ప్రతిపక్షాలకు ఇది చెంపపెట్టన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఉపయోగించే షాంపు నుంచి లగ్జరీ కార్ల వరకు భారీ ఊరట కల్పించారని హర్షం వ్యక్తంచేశారు. తద్వారా దేశంలో దీపావళి పండుగ సంబరాలు ఇప్పుడే మొదలయ్యాయన్నారు. ప్రధానంగా ఆరోగ్య, జీవిత బీమాలతో పాటు 33 రకాల అత్యవసర మందులపై జీరో జీఎస్‌టీ ఒక విప్లవాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగస్వాములవుతూ మన దేశ ఉత్పత్తులు పెంచి, గ్రామీణస్థాయి నుంచి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న మోదీ సంకల్పానికి తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బంటు రాము, నాయకులు జ్యోతి, వనిత, ఇప్పకాయల కిశోర్, తారక్ వేణు, హరీశ్‌రెడ్డి, పంచరెడ్డి శ్రీధర్, మాస్టర్ శంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోవాలి



ఖలీల్‌వాడి: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నచిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలకు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పాల్గొని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చని తెలిపారు.

కొనసాగుతున్న బీఈడీ, ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. బీఈడీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 27 మంది విద్యార్థులకు 18 మంది హాజరుకాగా, 9 మంది గైర్హాజరయ్యారు. ఎంఈడీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 31 మందికి గానూ 30 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు. వర్సిటీ కళాశాలలో సోమవారం జరిగిన ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో మొత్తం 39 మంది విద్యార్థులకు 34 మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ



మీనాక్షి నటరాజన్‌తో మాట్లాడుతున్న పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పీసీసీ డెలిగేట్, నిర్మల్ జిల్లా పార్టీ పరిశీలకులు బాడ్సి శేఖర్‌గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలో పార్టీ పరిస్థితి, జిల్లా, మండల కమిటీల ఎన్నిక, తదితర అంశాలను మీనాక్షి నటరాజన్‌కు వివరించారు. కామారెడ్డిలో ఈ నెల 15న నిర్వహించే బహిరంగసభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున బీసీలు, కాంగ్రెస్ కార్యకర్తలను తరలించాలని, సభ విజయవంతం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించినట్లు శేఖర్ గౌడ్ తెలిపారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో పార్టీ గెలుపు కోసం బాధ్యతలు అప్పగిస్తే పని చేయాలన్నారని పేర్కొన్నారు. కాగా, అంతకుముందు గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ, ఆఫీస్ బేరర్ల సమావేశానికి శేఖర్‌గౌడ్ హాజరయ్యారు.

విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమే

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



చౌట్‌పల్లి హైస్కూల్‌కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని, ఆటలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన మండల అంతర పాఠశాలల క్రీడాపోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలన్నారు. ఇక్కడి విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడానికి వ్యాయామ ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని అభినందించారు. మార్చ్ ఫాస్ట్‌లో మొదటిస్థానంలో చౌట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్, ద్వితీయ స్థానంలో బషీరాబాద్, కోనసముందర్, తృతీయ స్థానంలో హసకొత్తూర్ పాఠశాలలు నిలిచాయి. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో మొదటిస్థానంలో విజ్ఞాన జ్యోతి, ద్వితీయ స్థానంలో క్రిష్ణవేణి, తృతీయ స్థానంలో శ్రీవిద్యాసాయి పాఠశాలలు నిలిచాయి. వీరికి ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు.

గదుల నిర్మాణానికి కృషి..

అమీర్‌నగర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గదుల కొరత తీవ్రంగా ఉందని, గదుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి విన్నవించి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి, రేగుంట దేవేందర్, వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, ఎంఈవో ఆంధ్రయ్య, డీఎస్‌డీవో పవన్, నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువ ఆపదమిత్ర శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ నాగారం: నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో యువ ఆపదమిత్ర శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదలు, కరువు, భూకంపాలు, కరోనా వంటి విపత్కర సమయాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి, భద్రతా దళాలకు అండగా ఉండేందుకు యువతను సుశిక్షితులను చేసే అద్భుతమైన కార్యక్రమమని పేర్కొన్నారు. నిజామాబాద్ లేదా హైదరాబాద్‌లో వారం రోజులపాటు జరిగే శిక్షణ శిబిరం ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఆపత్కాలంలో ఉపయోగపడే ఎమర్జెన్సీ కిట్‌తోపాటు ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం జారీ చేసిన అడ్రస్ ప్రూఫ్‌తో జిల్లాకు చెందిన 18–40 ఏళ్ల వయస్సు యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9100435410 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన మానేయకుర్ రమేశ్(44) అప్పులబాధతో ఆదివారం గడ్డి మందు తాగినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. గమనించిన కుటుంబసభ్యులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: తండ్రిని చంపిన కేసులో ఓ కుమారుడికి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలిలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ మండలానికి చెందిన జాన్కంపల్లి విఠల్ 2021 మార్చి 16న హత్యకు గురయ్యాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా చిన్న కుమారుడు సంగమేశ్వర్‌తో తరుచూ గొడవలు జరిగేవి. సంగమేశ్వర్ తన తండ్రిని హత్య చేసి ఉరివేసుకున్నట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. కానీ అనుమానించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణలో హత్యగా తేలింది. దీంతో సంగమేశ్వర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితునికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్, కేసును సరైన పద్ధతిలో విచారణ జరిపిన సీఐలు రాజశేఖర్, రాజారెడ్డి, ఎస్సై రాజయ్య, భార్గవ్ గౌడ్, కోర్టు లైజనింగ్ అధికారి రామేశ్వర్‌రెడ్డి, సిబ్బంది సాయిలును ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

క్రైం కార్నర్

జార్ఖండ్‌లో అబ్బాపూర్‌తండా వాసి మృతి

- మృతుడు పోస్టల్ ఉద్యోగి




నవీపేట: మండలంలోని అబ్బాపూర్ తండాకు చెందిన సభావాత్ శ్రీహరి(20) సోమవారం జార్ఖండ్‌లో జరిగిన నీటి ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాపూర్ తండాకు చెందిన సభావత్ కైలాస్ కుమారుడు జార్ఖండ్ రాష్ట్రంలోని చక్రధర్‌పూర్ పరిధి ఒటాదిరి బ్రాంచ్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆయన స్నేహితులతో కలిసి సమీపంలోని వాటర్‌ఫాల్‌కు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగి నీటమునిగాడు. ఊపిరాడకపోవడంతో మృతి చెందాడు. జార్ఖండ్ పోలీసులు మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. శ్రీహరి మృతితో అబ్బాపూర్‌తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బస్సు ఢీకొని ఒకరు..



ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆగ్రాకు చెందిన సంతోష్(32) సోమవారం బైక్‌పై ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్‌కు వస్తున్నాడు. కంఠేశ్వర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో ముందున్న ఓ స్కూల్ బస్సును బైక్ ఢీకొట్టింది. ఆ వెంటనే వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న సంతోష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే సంతోష్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



కామారెడ్డి క్రైం: అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వస్తూ దారి మరిచి తప్పిపోయిన చిన్నారిని పట్టణ పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని ఆర్‌బీనగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన తూర్పాటి లక్ష్మి–చింటులకు 4 ఏళ్ల కుమార్తె సాయిపల్లవి ఉంది. ఆమె ప్రతిరోజు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఉదయం 10 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 2.45 గంటలకు తిరిగి వచ్చేది. సోమవారం ఇంటికి వస్తుండగా దారి తప్పి ఎక్కడికో వెళ్లిపోయింది. బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది గాలించడంతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిరిసిల్లా రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రీకాంత్ బాలికను చేరదీసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి కుటుంబసభ్యులకు సమాచారం అందించి చిన్నారిని అప్పగించారు.

బోధనలో ప్రత్యేకం మా'స్టారు'

- విద్యతోపాటు నైతిక విలువలకు పెద్దపీట



నంబి శ్రీనివాస్



క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న టీచర్ శ్రీనివాస్(ఫైల్)

నిజామాబాద్‌అర్బన్: బోధనలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు. పిల్లలకు విద్యతోపాటు నైతిక విలువలూ ముఖ్యమని భావిస్తాడు. 29 ఏళ్లుగా ఈయన బోధనలో నైతిక విలువలకు పెద్దపీట వేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాడు. ఆ విధానంతోనే భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామానికి చెందిన నంబి శ్రీనివాస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 1997లో ఆగస్టు 28న టీచర్ ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం వేల్పూర్ మండలం మోతె మండల పరిషత్ పాఠశాలలో ఎస్టీటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక విధానాలు, క్రమశిక్షణ అలవర్చారు. సమాజంలో మారుతున్న విధానాలపై విద్యార్థులకు బోధిస్తారు. వారంలో ఒకరోజు క్విజ్ పోటీలను నిర్వహిస్తూ సొంత డబ్బులతో వారికి బహుమతులు ప్రదానం చేసేవారు. విద్యార్థులతో మొక్కలు నాటించి, వాటి సంరక్షణకు కృషి చేస్తున్నారు. 'పిల్లలకు విద్యతోపాటు నైతిక విలువలు ఎంతో ముఖ్యం, క్రమశిక్షణ తోడైతే బంగారు భవిష్యత్తు లభిస్తుంది' అని చెబుతున్నారు నంబి శ్రీనివాస్. జిల్లాస్థాయి అవార్డు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని జెండా బాలాజీ దేవస్థానం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 7 వరకు నోట్ల ద్వారా రూ.5,79,130, నాణెములు రూ. 93,081, మొత్తం రూ. 6,72,211 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల వెల్లడించారు. ఆరు గ్రాముల మిశ్రమ బంగారం, 305 గ్రాముల మిశ్రమ వెండి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ.వేణు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ లవంగ ప్రమోద్ కుమార్, ధర్మకర్తలు పోలకొండ నర్సింగ్ రావు, సిరిపురం కిరణ్ కుమార్, పవర్ విజయ, కొర్వ రాజ్‌కుమార్, అర్చకులు నాగరాజాచార్యులు, జూనియర్ అసిస్టెంట్లు ప్రశాంత్ కుమార్, ఆంజనేయులు, రఘునాథ్, సహస్రనామ పారాయణ భక్తులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఒకరు మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): ముదెల్లి గ్రామానికి చెందిన ఒడ్నాల మొగుల య్య(59) పాముకాటు తో మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు సో మవారం తెలిపారు. మొగులయ్య ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. ఏదో కుట్టినట్లు తెలియడంతో మేల్కొని పరిశీలించగా పాము కనిపించింది. కుటుంబసభ్యులు పా మును చంపేసి మొగులయ్యను చికిత్స నిమి త్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించా రు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మొగుల య్య మృతి చెందినట్లు తెలిపారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

పిప్రిలో గౌడ కులస్తుల బహిష్కరణ



పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన పిప్రి గౌడ కులస్తులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో గౌడ కులస్తులపై గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు బహిష్కరణ వేటు వేశారు. కల్లు ధర పెంపు విషయంలో గ్రామానికి చెందిన తమను వీడీసీ బహిష్కరించినట్లు సోమవారం 54 గౌడ కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ప్రస్తుతం ఉన్న ధర సరిపోవడం లేదని, ధర పెంచుకుంటామని వీడీసీ దృష్టికి తీసుకెళ్లగా, తెల్లకాగితంపై సంతకాలు పెట్టి ఇవ్వాలని లేదంటే తాము చెప్పినట్లు వినాలని హుకుం జారీ చేసినట్లు తెలిపారు. తెల్లకాగితంపై సంతకాలు చేయకపోవడంతో తమను బహిష్కరించినట్లు పేర్కొన్నారు. తమకు సంబంధించిన హోటళ్లు, దుకాణాలు, ఆటోల్లోకి ఎవరినీ రానివ్వకుండా ఆంక్షలు పెట్టినట్లు గౌడ కులస్తులు తెలిపారు.

అసభ్య పోస్టింగ్‌పై కేసు నమోదు

- నవీపేటలో ఉద్రిక్తత

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ఒక వర్గానికి చెందిన యువకుడు మరో వర్గాన్ని కించపరుస్తూ అసభ్యకర పోస్టింగ్‌ను సోమవారం రాత్రి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పోస్టింగ్‌పై మండిపడిన మరో వర్గానికి చెందిన యువకులు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి నినాదాలు చేశారు. దీంతో పోస్టింగ్ షేర్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మరో వర్గానికి చెందిన యువకులను శాంతింపజేశారు. ముందు జాగ్రత్తగా నార్త్ టౌన్ సీఐ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.